ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శనివారం 27 ఏప్రిల్ 2024



నాగర్‌కర్నూల్‌లో నేడు కేసీఆర్ రోడ్‌షో

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గులాబీ బాస్ కేసీఆర్ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు రోడ్డు మార్గం ద్వారా ఉయ్యాలవాడకు చేరుకోనున్న చంద్రశేఖర్‌రావు జిల్లా కేంద్రంలో రెండు కిలో మీటర్ల మేర రోడ్ షోలో పాల్గొంటారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రోడ్ షోను విజయవంతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పార్టీ క్యాడర్‌తో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త మృతి


లీలావతి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 26 : రోడ్డు ప్రమాదంలో ఆశ వర్కర్ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని లింగాల మండల కేంద్రానికి చెందిన ఆశ వర్కర్ లీలావతి(40) కాన్పు కోసం ఓ గర్భిణిని గురువారం జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చింది. రాత్రి శివకుమార్ అనే వ్యక్తి బైకుపై లింగాలకు తిరిగి వెళ్తుండగా బస్‌డిపో సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు ఆమె కింద పడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుమారుడు దిలీపాచారి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆశ కార్యకర్త మృతి చెందిన సంఘటన తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ శుక్రవారం లీలావతి మృతదేహాన్ని పరిశీలించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జరిగిన సంఘటన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్.. మధ్యనే పోటీ


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్; చిత్రంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు


సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్‌కు మూడో స్థానమే..
- ఆ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే..
- పీఆర్ఎల్ఐకి జాతీయ హోదా తేని డీకే అరుణకు ఓటు వేయొద్దు
- రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్


బస్సులో వస్తున్న సీఎం కేసీఆర్..

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బీజేపీకి వేసినట్లేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్ పరిధిలో కాంగ్రెస్‌కు మూడో స్థానమే వస్తుందని, ప్రధాన పోటీ బీఆర్ఎస్, బీజేపీకి మధ్యనే ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తరఫున కేసీఆర్ పాలమూరులో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాక్ టవర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. పాలమూరు ప్రజలు పొరపాటున కూడా కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని గుర్తు చేశారు. వెనుకబడిన ప్రాంతంగా, పేద జిల్లాగా, వలసలు పోయిన జిల్లాగా పేరున్న మహబూబ్‌నగర్‌లో సాగు, తాగునీటి కోసం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మించుకుంటుంటే.. జాతీయ హోదా ఇవ్వాలని వందసార్లు ప్రధాన మంత్రి మోదీకి రాశానని, కానీ ఇవ్వలేదన్నారు. ఐదేళ్లుగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణ.. పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాను సాధించలేదని ఆరోపించారు. ఆంధ్రోళ్లు నీళ్లు తరలించుకుపోతుంటే.. పాదయాత్ర చేసిన రఘువీరారెడ్డికి డీకే అరుణ మంగళహారతులు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా.. అడిగితే తెలంగాణ రాష్ట్ర సాధకుడినైన తనను అనరాని మాటలు అంటోందన్నారు. మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మొదటి నుంచీ సెక్యులర్ పార్టీగా ఉందని, ముస్లిం, మైనారిటీల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వారి కళ్ల ముందు ఉన్నాయన్నారు. ముస్లింలు బీజేపీ మీద కోపంతో కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని కోరారు. పాలమూరులో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బీజేపీ గెలవడం ఖాయమన్నారు. అంతకుముందు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో పాలమూరు సస్యశ్యామలం అయ్యిందని చెప్పారు. వలసలు వాపస్ వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పిందని, పింఛన్‌ను రూ.4 వేలు చేస్తామని చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని, పెళ్లిళ్లు వాయిదా వేసుకోవాలని అన్నారన్నారు. అది నమ్మి ఓట్లు వేస్తే తులం బంగారం రాలేదని, రూ.2,000 పింఛన్లు రూ.4,000 కాలేదని విమర్శించారు. కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా పరిస్థితి తయారైందన్నారు. కేసీఆర్ ఉంటే రోజూ నీళ్లు వచ్చేవని, ఇప్పుడు మహబూబ్‌నగర్‌లో వారానికోసారి నీళ్లు వస్తున్నాయని ఆరోపించారు.


పాలమూరులో కొనసాగుతున్న ర్యాలీ

భారీగా జనం హాజరు.. సభ సక్సెస్...

కేసీఆర్ పోరుబాటలో భాగంగా పాలమూరు పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాయంత్రం ఏడు గంటలకు జడ్చర్లకు చేరుకున్నారు. అక్కడి నుంచి వందలాది వాహనాలతో ర్యాలీగా బయల్దేరారు. పిస్తా హౌస్ నుంచి భారీ జన సందోహం మధ్య ర్యాలీ క్లాక్ టవర్ వరకు కొనసాగింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు, శ్రేణులు రోడ్డు షోకు హాజరయ్యారు. గులాబీ జెండాలు, కాగితపు పూలతో రోడ్డంతా గులాబీమయమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలవడంతో కొంత నైరాశ్యంలోకి వెళ్లిపోయిన బీఆర్ఎస్ కేడర్‌ను కేసీఆర్ పర్యటన ఉత్తేజితులను చేసింది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో పోలిస్తే కాస్త ఆలస్యంగా ప్రచారం ప్రారంభించినప్పటికీ.. తాజాగా కేసీఆర్ పర్యటనతో ప్రచారం ఊపందుకోనుంది. ఇదిలా ఉంటే.. రోడ్ షో అనంతరం కేసీఆర్ శ్రీనివాస్‌గౌడ్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడే రాత్రి బస చేసి.. రేపు మధ్యాహ్నం తర్వాత నాగర్‌కర్నూల్ రోడ్డు షోకు బయల్దేరి వెళ్లనున్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సురవరం దార్శనికుడు

- పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 26: సురవరం ప్రతాపరెడ్డి గొప్ప దార్శనికుడని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. శుక్రవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య సభ నిర్వహించారు. లక్ష్మీకాంత్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు బాషాభివృద్ధికి సురవరం ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. నిజాం ప్రభుత్వాన్ని ఎదురించి, వాస్తవ పరిస్థితులను, తెలంగాణ సాహిత్యాన్ని ప్రజలకు తెలియజేశారని చెప్పారు. పత్రికా రచయితగా, హైందవ ధర్మ సంధానకర్తగా, గ్రంధాలయాల నిర్మాణంలో ప్రముఖపాత్ర పోషించారన్నారు. 1926లో గోల్కొండ పత్రికను స్థాపించి, తెలంగాణలోని సాహిత్యాన్ని తెలియజేశారని చెప్పారు. అంతకు ముందు లోక కవి అందెశ్రీ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణలో కవులకు గుర్తింపు తెచ్చారన్నారు. జోగిపేటలో తొలి మహాసభను నిర్వహించడం ద్వారా ఎన్నో ఉద్యమాలకు నాంది పలికారన్నారు. తెలంగాణలో కవులు లేరని కించపరిచినప్పుడు ఉన్నారని ప్రపంచానికి తెలియజేశారని చెప్పారు. సురవరం స్పూర్తితోనే తాను నిప్పులవాగు రచించానన్నారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ సురవరం భూస్వామ్య వ్యవస్థను బద్దలు కొట్టి, తెలుగు బాషాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. తెలంగాణలో ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. ఆంధ్ర జన సంఘ సభ ద్వారా సంఘ సంస్కర్త అని నిరూపించుకున్నారని చెప్పారు. విశ్రాంత ప్రొఫెసర్ అండమ్మ మాట్లాడుతూ నిజాం కాలంలో సురవరం రచించిన మొగులాయిల కథలు ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. స్త్రీల కోసం ఎన్నో కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఆ రోజుల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సురవరం ప్రతాప రెడ్డి కుమారుడు డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తండ్రి చేసిన సేవలను దగ్గరి నుంచి చూసిన అనుభవాలను పంచుకున్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి మనువడు సురవరం అనీల్ కుమార్‌రెడ్డి తాత సమాజిక కోణాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆచార్య మనస చెన్నప్ప, ఆచార్య గోనా నాయక్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.

బీజేపీకి ఓటేస్తే అంధకారం

- ఆ పార్టీ అధికారంలోకొస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుంది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి


అలంపూర్ ఆలయాల వద్ద కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి దంపతులు

కొత్తకోట/అలంపూర్, ఏప్రిల్ 26: బీజేపీకి ఓటేస్తే పాలమూరు ఉమ్మడి జిల్లా అభివృద్ధి మరోమారు అంధకారం అవుతుందని చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట, ముమ్మళపల్లి, పామాపురం, పాలెం, వడ్డెవాట గ్రామాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ హామీలను అమలు చేయకుండా దేవుడి పేరుతో ఓట్లడుగుతూ రాజకీయం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కడం కోసం.. గుంటనక్కల బుద్ధి పోనిచ్చుకోవడం లేదని ఎద్దేవా చేశారు. 400 సీట్లు సాధించి మళ్లీ అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, పొరపాటున ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషిని, ఈనాటి కాంగ్రెస్ పార్టీ లక్ష్యాన్నే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి దేశ ఐక్యత, అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. ఒకనాడు ఎన్నికలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి పేరిట జరిగేవని.. ఈనాడు కుట్రలు కుతంత్రాలు, మతం, కులం, భవిష్యత్ వినాశనం కోసం జరుగుతున్నాయన్నారు. అందుకే విజ్ఞానవంతులు, మేధావులు, కులసంఘాలు, పౌర సమాజం ఆలోచించాలన్నారు. దేశాన్ని ముక్కలు చేసే బీజేపీ పాలనకు స్వస్తి పలికి, రాజ్యాంగాన్ని.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుకుందామని పిలుపు నిచ్చారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం సీఎం రేవంత్ రెడ్డికి వస్తే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఓర్వడం లేదన్నారు. ఒక్కసారి మీ పదేళ్ల పాలన గురించి మాట్లాడాలన్నారు. పాలమూరుపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారే తప్ప.. అభివృద్ధి కోసం పని చేయడం లేదన్నారు. దేశ ప్రజల ఐక్యత కోసం రాహుల్‌గాంధీ తలపెట్టిన స్ఫూర్తితోనే పాలమూరు అభివృద్ధికి సీఎం పునాదులు వేశారని, అందుకే ప్రజలంతా ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. అంతకు ముందు పామాపురం అభయాంజనేయస్వామి ఆలయంలో వంశీచంద్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అరవింద్ కుమార్‌రెడ్డి, ప్రశాంత్, బీచుపల్లి యాదవ్, కృష్ణారెడ్డి, బోయోజ్, చంద్రమోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేష్, పాల్గొన్నారు.

అలంపూర్‌లో పూజలు

ఐదో శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వరస్వామి వార్లను కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి, శాలువాతో సత్కరించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

- సీఎం రేవంత్ రెడ్డికి డీకే అరుణ సవాల్



మద్దూరులో విలేకరులతో మాట్లాడుతున్న డీకే అరుణ

మద్దూర్/కోస్గి రూరల్, ఏప్రిల్ 26: 'నా హయాంలో గద్వాల నియోజకవర్గం అభివృద్ధి జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. గద్వాల పోదం.. కొడంగల్‌లో తిరుగుదం. ఏది అభివృద్ధి జరిగిందో తెలుస్తుంది. దమ్ముంటే చర్చకు రా. మీడియా సమక్షంలో తెల్చుకుందాం' అని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ సవాల్ విసిరారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని గుండుమల్, హన్మాన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె ప్రచారం చేయడంతో పాటు మద్దూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలను చేయకుండా అడ్డగోలుగా మాట్లాడటం ఓ ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. కొడంగల్‌కు రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని, తాను మంత్రిగా ఉన్నప్పుడు ఆ నియోజకవర్గానికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయించానని చెప్పారు. తనను ఓడించడానికి చేస్తున్న కుట్రలు ఏ మాత్రం పని చేయవన్నారు. నువ్వు ఈ ప్రాంతం వాసివి కాకపోయినా.. కొడంగల్ ప్రజలు నిన్ను ఆదరించారన్నారు. ముఖ్యమంత్రి అవుతాడనే రేవంత్‌కు ఓట్లు వేశారని, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నెరవేర్చాకే తిరిగి ఓట్లు అడగాలన్నారు. అంతవరకు ఓట్లు అడిగే హక్కు రేవంత్‌కు లేదన్నారు. ఒక ఆడ బిడ్డను ఎదుర్కోడానికి ఇంత మంది కాంగ్రెసోళ్లు దాడి చేస్తారా?.. ఎంత మంది దాడి చేసినా తన గెలుపును ఆపలేరన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ లేదు.. రాహుల్ ప్రధాన మంత్రి అయ్యేది లేదని అన్నారు. ప్రతిపక్షాలకు ప్రధాన మంత్రి అభ్యర్థే లేడని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మూడోసారి మోదీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ కూడా తాను గెలిస్తే కేంద్రం నుంచి పాలమూరు ప్రాజెక్టుకు అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేయడానికి దోహద పడుతుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ మండల నాయకులు మదన్, శంకర్, వెంకటయ్య. చందు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు: బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి పలువురు నాయకులు డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. బిజ్జారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంగప్ప, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డితోపాటు మరో 50 మంది కమలం కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగురావు నామాజీ మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు శ్రీకాంత్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

- వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత

వనపర్తి అర్బన్/మహబూబ్‌నగర్/గద్వాల టౌన్/నారాయణపేట, ఏప్రిల్ 26: భానుడు భగభగమండుతుండటంతో పాలమూరు నిప్పులకొలిమిలా మారుతోంది. రోజంతా జనం ఎండలకు తాళలేక అల్లాడిపోతున్నారు. పలు మండలాల్లో రహదారులు మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో శుక్రవారం ఎండప్రచండానికి శుభకార్యాలకు వెళ్లేవారు ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోట 44.0, పెబ్బేరు 43.0, శ్రీరంగాపూర్ 42.8, చిన్నంబావి 42.1, ఆత్మకూరు 42.0, వనపర్తి, పెద్దమందడి 41.9, మదనాపూర్ 41.7, అమరచింత 41.6, గోపాల్‌పేట, ఘణపూర్ 41.5, వీపనగండ్ల 41.2, రేవల్లి 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో 44.2 డిగ్రీలు, బాలానగర్‌లో 43.5, మిడ్జిల్, మూసాపేటలో 43.2, అడ్డాకులలో 43.1, జడ్చర్లలో 42.3, మహబూబ్‌నగర్‌లో 41.3 డిగ్రీలు నమోదుకాగా, రాజాపూర్ మండలంలో అత్యల్పంగా 39.9 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కల్వకుర్తిలో 43.4, కోడేరు, వెల్దండ, వంగూరు మండలాల్లో 42.5, అచ్చంపేటలో 42.2, ఉప్పునుంతలలో 42, పెద్దకొత్తపల్లి, లింగాల మండలాల్లో 41.9, నాగర్‌కర్నూల్‌లో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాని గద్వాల, వడ్డేపల్లిలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా అలంపూర్‌లో 42.8 డిగ్రీలు, రాజోళిలో 42.5 డిగ్రీలు, కేటిదొడ్డిలో 42.3 డిగ్రీలు, ఇటిక్యాలలో 42.2 డిగ్రీలు, అయిజలో 41.7 డిగ్రీలు, మల్దకల్‌లో 41.6 డిగ్రీలు, ఉండవల్లిలో 41.4 డిగ్రీలు, మానవపాడులో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా నర్వలో 42 డిగ్రీలు, కోస్గి, మక్తల్, కృష్ణలలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఐరిస్‌తో దళారులకు చెక్

- ధాన్యం కొనుగోలులో నూతన విధానం
- కొనుగోళ్లలో అక్రమాలు జరుగకుండా ప్రభుత్వం చర్యలు


కొనుగోలు కేంద్రం వద్ద రైతు కంటిని స్కాన్ చేస్తున్న నిర్వాహకుడు


ఐరిస్ యంత్రం

వనపర్తి అర్బన్, ఏప్రిల్ 26: ధాన్యం కొనుగోలులో దళారుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేరుతో దళారులు ధాన్యాన్ని విక్రయించి, లబ్ధిపొందేవారు. వారికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ సంవత్సరం యాసంగి నుంచి ఐరిస్ గుర్తింపు విధానానికి శ్రీకారం చుట్టింది. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని విక్రయించాలంటే ముందుగా రైతుల ఐరిస్(కళ్లను స్కాన్ చేయించుకోవాలి)ను ఇవ్వాలి. దాంతో నకిలీ రైతులైతే ఇట్టే తెలిసిపోతుంది. జిల్లా వ్యాప్తంగా 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా.. 81 కేంద్రాల్లో ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఓటీపీ నుంచి ఐరిస్..

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని గతంలో నిర్వాహకులు పరిశీలించి, 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కాంట చేసేవారు. కొన్న ధాన్యం వివరాలను కేంద్రాల ఇన్‌చార్జీల ట్యాబ్‌లలో రైతుల ఆధార్ నెంబర్ల మీద నమోదు చేయగానే.. రైతుల ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. రైతులకు వచ్చిన ఓటీపీని ట్యాబ్‌లో నమోదు చేసి, రైతు పేరు, భూమి విస్తీర్ణం, గ్రామం, బ్యాంకు ఖాతా, కాంటా చేసిన ధాన్యం బస్తాల వివరాలను నమోదు చేసి ఒకే చేయగానే ఆ వివరాలు పౌరసరఫరాల శాఖకు చేరుతుండేవి. దాంతో గడువును బట్టి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేసేది. అయితే దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారని ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

రైతులు కేంద్రానికి రావాల్సిందే

ఐరిస్ విధానం వల్ల ధాన్యం విక్రయించే ప్రతీ రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ధాన్యం తూకమైన తరువాత నిర్వాహకులు సంబంధిత రైతుల ఐరిస్ తీసుకుంటారు. కౌలు రైతులైతే మొదట ఏఈవోలను సంప్రదించి, ఎవరి భూమిని కౌలుకు తీసుకున్నారో వారి వివరాలు నమోదు చేయించాలి. సంబంధిత ఏఈవో ఎలు ఓపీఎంఎస్‌లో కౌలు రైతుల వివరాలను నమోదు చేస్తారు. దీంతో వారు పండించిన ధాన్యాన్ని విక్రయించే అవకాశం ఉంటుంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించే రైతుల ఐరిస్‌ను నిర్వాహకులు తీసుకొని, ఈ పాస్ యంత్రంలో నమోదు చేయగానే రైతుల వివరాలు కనిపిస్తాయి. సదరు రైతుకు చెందిన ధాన్యాన్ని ఎంటర్ చేసి, ఒకే చేయగానే పౌరసరఫరాల శాఖ అధికారులకు వివరాలు చేరుతాయి. దీంతో కొనుగోలు కేంద్రాల్లో దళారుల వ్యవస్థకు చెక్ పడనుంది.

బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగించిన ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 26 : జిల్లాలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రేస్ చేసి 52 మందికి తమ ఫోన్లను అందజేసినట్లు ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ శుక్రవారం తెలిపారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) విధానం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న 466 మంది మొబైల్ ఫోన్లను ట్రేసౌట్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ వివరించారు. జిల్లాలో ఇంకా వందఫోన్లు ఇతర రాష్ట్రాల్లో ట్రేస్ అయి ఉన్నాయని త్వరలో వాటిని రికవరీ చేసి ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1500కి పైగా మొబైల్ ఫోన్లు మిస్ అయినట్లు ఆయన చెప్పారు.

కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ట్రేస్ ఔట్ చేసిన సిబ్బంది విక్రమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


బాధితులకు ఫోన్లను అప్పగిస్తున్న ఎస్పీ

చేపల పెంపకంలో జాగ్రత్త వహించాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 26 : చేపలు పెంచుతున్న మత్స్యకారులు వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు చెరువులో నీటి నాణ్యత, లోతు, విస్తీర్ణం, చేపల కదలికలను గమనించాలన్నారు. ఉదయాన్నే చెరువులో చేపలు నోరు తెరుచుకుని నీటి పైభాగాన తిరుగుతూ ఉంటే ప్రాణ వాయువు కొరత ఉందని గమనించాలన్నారు. అలాంటి సమయంలో చెరువులో కొత్త నీరు పట్టడం సాధ్యం కాకపోతే పెద్ద చేపలను పట్టుకుని అమ్ముకోవాలన్నారు. తద్వారా చేపల సాంద్రత తగ్గి ప్రాణ వాయువు కొరతను అధిగమించవచ్చన్నారు. చెరువులో నీటి నాణ్యత తగ్గినప్పుడు ఒక హెక్టారుకు 100 నుంచి 250 కేజీల వరకు సున్నాన్ని చల్లాలని తెలిపారు. ఫలితంగా నీటి నాణ్యత పెరగడంతో పాటు ప్రాణ వాయువు శాతం కూడా పెరుగుతుందని సూచించారు. చనిపోయిన చేపలను వెంటనే తీసి చెరువుకు దూరంగా గోతి తీసి పాతి పెట్టాలని లేకపోతే కాల్చి వేయాలని తెలిపారు. అలా చేయకపోతే మిగతా చేపలు కూడా వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేడు అచ్చంపేటకు ఎమ్మెల్సీ రాక

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ శనివారం అచ్చంపేటకు రానున్నట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో నిర్వహించనున్న పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అలంకారప్రాయంగా

వరి కొనుగోలు కేంద్రాలు

» పొలం వద్దకు వచ్చి కొంటున్న రైస్‌మిల్ నిర్వాహకులు

» ప్రభుత్వ ధర కంటే అధికం

కోయిలకొండ, ఏప్రిల్ 26 : మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలో ప్రారంభించిన వరి కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. మండలంలో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని సురారం, శేరివెంకటాపూర్, చందాపూర్, ఆచార్యపూర్, ఇబ్రహీంనగర్, వీరంపల్లి, కోయిలకొండలో గత నెలరోజుల క్రితం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇప్పటివరకు మొత్తం ఏడు కేంద్రాలకు గాను కోయిలకొండలో రెండు ట్రాక్టర్లు, చందాపూర్‌లో ఒక లారీ, మిగతా చోట్ల 1,151 బస్తాల వరి ధాన్యం కొనుగోళ్లు చేశారు. సింగిల్ విండో ద్వారా గతంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఈసారి ఒక కేంద్రం అంకిళ్లలో గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం వరి క్వింటాల్‌కు రూ.2203 అందిస్తుండగా, రైస్‌మిల్‌తో పాటు, ఇతర వ్యక్తులు కోత కోసిన వరి ధాన్యానికి రూ.2250, ఆరబెట్టిన ధాన్యానికి రూ.2400 నుంచి రూ.2700 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే బయట ధాన్యం అమ్మితే హమాలీ డబ్బులు మిగలడంతో పాటు ధర ఎక్కువ వస్తుందన్న ఆశతో రైతు బయట అమ్మడానికే ఆసక్తి చూపుతున్నారు. రైతులు ఫోన్ చేయడమే ఆలస్యం వారి చెప్పినచోటకు లారీ వచ్చి ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు. కాగా, రైతులు ఈయేడాది ఆర్ఎన్ఆర్ సన్న రకం ఎక్కువగా సాగు చేయడంతో ప్రభుత్వ ధర కంటే బయట ఎక్కువ ధర వస్తుందని చెబుతున్నారు. కొంత మంది రైతులు 1010 దొడ్డు రకం వరి సాగు చేయగా వాటిని కూడా ప్రైవేటు కొనుగోలుదారులు తీసుకెళ్తున్నారు.

పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేశారు..



వరి కోత చేసిన వెంటనే బయట వ్యక్తులు వచ్చి మీ ధాన్యాన్ని కొంటామని చెప్పారు. వారికి క్వింటాల్‌కు రూ.2500లతో 30 క్వింటాళ్ల ధాన్యం అమ్మా. హమాలీల ఖర్చు లేకుండా వారు ధాన్యం తీసుకెళ్లారు. ప్రభుత్వం కంటే బయటి వారు ఎక్కువ ధర ఇస్తున్నారు.

- రాములు, రైతు, కోయిలకొండ

వరిని కొనుగోలు చేస్తున్నాం..



మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏడు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. రైతులు ధాన్యం తీసుక వస్తే తూకం చేయడానికి సిద్ధంగా ఉన్నాం. రైతులు బయట అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించాలి.

- విజయకుమారి, ఏపీఎం



బయట వ్యక్తులు కొన్న వరిని లారీలోకి నింపుతున్న కూలీలు



కోయిలకొండలో ఐకేపీ ఆధ్వర్యంలో ప్రారంభించిన కొనుగోలు కేంద్రం (ఫైల్)

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో

వాగ్దేవి విద్యార్థుల జయకేతనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 26 : జేఈఈ మెయిన్ తుది ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. జేఈఈ మెయిన్స్‌లో వాగ్దేవి విద్యార్థులు అన్విత 99.13 పర్సంటైల్, కీర్తన 95.92 పర్సంటైల్ సాధించారు. వీరితో పాటు సాయి, భరత్, స్వప్న, సునీల్‌కుమార్, రిషిక శివకుమార్‌లు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతీ ఏడాది జాతీయ స్థాయి ర్యాంకుల సాధిస్తున్నారని తెలిపారు. ఇంటర్‌తో పాటు నీట్, జేఈఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటారన్నారు. కార్యక్రమంలో నీట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గీతాదేవి అధ్యాపకులు రాఘవేందర్‌రావు, నాగేందర్, ఎంసెట్ ఇన్‌చార్జి షాకిర్‌యాకుబ్, గోవిందరాజులు, లక్ష్మణ్‌రాజు, రామ్‌రెడ్డి తదితరులున్నారు.

20 నామినేషన్ల తిరస్కరణ

» తిరస్కరణకు గురైన బీఎస్పీ అభ్యర్థి మందా జగన్నాథ్ నామినేషన్

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు లోక్ సభ స్థానాల్లో దాఖలైన నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరిగింది. మొత్తం 20 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు.

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి వివిధ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లలో 13 తిరస్కరణకు గురయ్యాయి. నాగర్‌కర్నూల్ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 34 సెట్ల నామినేషన్లు దాఖలు కాగా వివిధ కారణాలతో 13 నామినేషన్లను రిటర్నింగ్ అధికారి రిజెక్టు చేశారు. అందులో బహుజన సమాజ్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎంపీ, బీఎస్పీ అభ్యర్థి మంద జగన్నాథ్ కూడా ఉన్నారు. ఆయన ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న సమయంలో వివిధ బిల్లులు పెండింగ్‌లో ఉన్న కారణంగా నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు తెలిసింది.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 42 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో పారదర్శకంగా నామినేషన్ల పరిశీలన జరిగింది. అయితే మొత్తం 42 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా స్ర్కూటినిలో 35 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించగా ఏడుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ వెల్లడించారు.

కొండారెడ్డిపల్లిలో ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ

» హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు

వంగూరు, ఏప్రిల్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో శుక్రవారం పురాతన అంజనేయ స్వామి ఆలయ పునః నిర్మాణానికి ఘనంగా భూమిపూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు ఎనుముల తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డిలు కుటుంబ సమేతంగా హాజరైయ్యారు. ఆలయ పునఃనిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో అభిషేకం, యగ్నపూజలు చేశారు. సుమారు రూ.నాలుగు కోట్లతో ఈ ఆలయాన్ని చక్కగా నిర్మించనున్నట్లు వారు తెలిపారు. తపస్వి శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారి విగ్రహాన్ని కదిలించారు. స్థానికులు, నాయకులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, వేమారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి, ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, లాలుయాదవ్, ముత్యాల గోవర్ధన్‌రెడ్డి, కదారి జంగయ్య, వంశీ తదితరులున్నారు.



ఆలయ పునః నిర్మాణానికి పూజలు చేస్తున్న సీఎం సోదరులు

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో

మూడో స్థానంలో నిలిచిన జిల్లా మహిళా జట్టు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, ఏప్రిల్ 26 : ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లా మహిళా జట్టు మూడో స్థానంలో నిలిచింది. జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించడంపై హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహెమాన్, జియావుద్దీన్, అసోసియేట్ గౌరవ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి జట్టు క్రీడాకారులను అభినందించారు.



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా మహిళ జట్టు

పిచ్చికుక్క స్వైర విహారం, 16 మందికి గాయాలు

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తోంది. పట్టణంలోని వెంకటేశ్వరకాలనీ, టీచర్స్ కాలనీల్లో ఆడుకుంటున్న చిన్నారులపై కుక్క దాడి చేసింది. దాడిలో చిన్నారి నోమికకు తీవ్ర గాయాలయ్యాయి. అదేకాలనీలో నివాసం ఉంటున్న కండక్టర్‌తో పాటు మహిళపై దాడి చేసినట్లు తెలిపారు. చిన్నారికి అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. కుక్కకాటుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సిన్ లేకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో వ్యాక్సిన్ తీసుకున్నట్లు బాధితుడు శ్యాం తెలిపారు. చిన్నారితో పాటు మరో 15 మందిపై దాడి చేసినట్లు బాధితులు వాపోయారు. కుక్కల స్వైరవిహారంతో పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి కుక్కల దాడి నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ పట్టణంలోని టీచర్స్‌కాలనీతో పాటు, మారుతినగర్, వెంకటేశ్వర కాలనీల్లో పర్యటించారు. కుక్క ఆచూకీ కోసం ప్రయత్నించారు. త్వరలో కుక్కలను పట్టుకొని సుదూర ప్రాంతాల్లో వదులుతామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.



వెంకటేశ్వర కాలనీలో వివరాలు సేకరిస్తున్న మునిసిపల్ కమిషనర్

కొనసాగుతున్న తనిఖీలు

» నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు రూ.69 లక్షల 67 వేలు పట్టివేత

» 1,823లీటర్ల మద్యం సీజ్

» ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న ఆరు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేస్తున్నామని, తనిఖీల్లో రూ.69లక్షల 67వేల నగదు, 1,823 లీటర్ల మద్యం సీజ్ చేసి, 300మందిని బైండోవర్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వరకు చేసిన తనిఖీల్లో 78 క్యాష్ సీజ్ కేసులతో పాటు, 120 లిక్కర్ కేసులు నమోదు చేసి, 315 కేజీల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే, 223 బైండోవర్ కేసులు చేసి 300 మందిని బైండోవర్ చేయడంతో పాటు 23 అయుధాలు, 108 చీరలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

బాలానగర్ చెక్‌పోస్టు వద్ద..

బాలానగర్ : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఏఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన వాహనాల తనిఖీలో నగదు పట్టుబడింది. హైదరాబాద్‌లోని జమ్మిరాత్ బజార్‌కు చెందిన చంద్రకాంత్ వద్ద రూ.లక్షా 18వేలు కన్పించడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఏఎస్సై తెలిపారు.



బాలానగర్‌లో సీజ్ చేసిన నగదుతో పోలీసులు

చారకొండలో...

చారకొండ : చారకొండ పోలీస్‌స్టేషన్‌వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద రూ.60 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అశోక్ జ్యువెలరీ పనిమీద కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా నగదు పట్టుబడిందని, డబ్బును జిల్లా గ్రీవేన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై వివరించారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

పాలమూరు, ఏప్రిల్ 26 : భారత రాజ్యాంగం మహోన్నతమైంది.. దానిని రక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని ఎంఈఎఫ్ నాయకులు అద్దాకుల తిమ్మప్ప, ఆకెపోగు రాములు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 27వ తేదీన జిల్లా కేంద్రంలో చేపట్టిన మనువాదం మనకు వద్దు-మానవీయ సమాజాన్ని నిర్మిద్దామనే బహిరంగ సభను విజయవంతం చేయడంలో ఎంఈఎఫ్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డా.బీఆర్ అంబేద్కర్ పలు దేశాల రాజ్యాంగాలను పరిశీలించి రూపొందించిన రాజ్యాంగమన్నారు. ఇలాంటి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం పనికిరాదు, మన సంస్కృతే మన రాజ్యాంగమని బీజేపీ ఎంపీలే బాహటంగా చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

నేడు పూలే, అంబేద్కర్ నాలుగవ జాతర

పాలమూరు, ఏప్రిల్ 26 : పాలమూరు పట్టణంలో శనివారం పూలే, అంబేద్కర్ నాలుగవ జాతర నిర్వహించనున్నట్లు పూలే, అంబేద్కర్ వ్యవస్థాపక అధ్యక్షులు బీనరసింహులు, మామిడి సామెల్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జాతరకు ప్రొఫెసర్ కాశీం, గాలి వినోద్‌కుమార్, మచ్చ దేవేందర్, గజ్జల అశోక్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజలు, అభ్యుదయ వాదులు, అంబేద్కర్, పూలే అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

కొల్లాపూర్, ఏప్రిల్ 26 : ఉరి వేసుకొని గిరిజన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం బోడబండ తండాలో చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడబండతాండాకు చెందిన మూడావత్ సురేష్ భార్య కవిత(24) ఇంట్లో తలెత్తిన మనస్పర్థల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జరిగిన ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై రిషికేష్ తెలిపారు.

రైలు కింద పడి యువకుడు..

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 26 : రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం జోగుళాంబ రైల్వేహాల్ట్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం సమయంలో కర్నూల్ సిటీ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు కింద పడి గుర్తుతెలియని 25 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి ఎత్తు 5.6 అని చాక్లెట్ కలర్ రెడీమేడ్ ఫుల్‌షర్టు, బూడిదరంగు జీన్ ప్యాంటు, కుడిచేతిపై అమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉందని వివరించారు. యువకుడి వద్దనున్న రెడ్‌మీ మొబైల్ పగిలిపోయిందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జోగుళాంబ రైల్వేహాల్ట్‌లో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కొల్లాపూర్, ఏప్రిల్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని తాళ్లనర్సింగపురం గ్రామానికి చెందిన ఆవుల శివకృష్ణ(33) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో శవమై కన్పించాడు. రెండురోజుల క్రితం యన్మన్‌బెట్ల గ్రామానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన శివకృష్ణ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. శుక్రవారం తాళ్లనర్సింగపురం - యన్మన్‌బెట్ల సమీపంలో మామిడితోట వద్ద శివకృష్ణ శవమై కన్పించాడు. మృతుడికి భార్య, బాబు ఉన్నారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోడజానంపేట గ్రామంలో మరొకరు..

బాలానగర్ : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం బోడజానంపేట గ్రామంలో కరుణాకర్‌రెడ్డి(35) అనే వ్యక్తి శుక్రవారం అనుమానాస్పద స్థితిలో అతని ఇంట్లో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఎస్సైని ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవల్లి, ఏప్రిల్ 26 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాసులునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం చిన్న ఆముదాలపాడు గ్రామానికి చెందిన అడ్డాకుల శీను(51) టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై ఈనెల 20వ తేదీన ఉదయం పని నిమిత్తం ఉండవల్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టును బలంగా ఢీకొన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● పెబ్బేరు : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్ర సమీపంలో ఈనెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బత్తిని బాలస్వామి(50) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి ఈనెల 19న పెబ్బేరుకు పని నిమిత్తం వచ్చి ఆటోలో తిరిగి గ్రామానికి వెళ్తుండగా ఆటో అదుపు తప్పడంతో కిందపడ్డాడు. బాలస్వామికి బలమైన గాయాలు కావడంతో కుటుంబీకులు మొదట వనపర్తి ఆసుపత్రికి తరలించి ఆపై మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువు బత్తిని అర్జునయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి నాలుగు రోజుల జైలుశిక్ష

కల్వకుర్తి, ఏప్రిల్ 26 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగురోజుల జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్లు కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం అతన్ని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి కావ్య పట్టుబడిన కృష్ణయ్యకు నాలుగురోజుల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

సద్దలోనిపల్లి దేవాలయంలో పట్టపగలు చోరీ

» రూ.రెండు లక్షలు దోచుకెళ్లిన దొంగలు

మల్దకల్, ఏప్రిల్ 26 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి శ్రీకృష్ణస్వామి ఆలయంలో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. హుండీలో ఉన్న దాదాపు రూ.రెండు లక్షల నగదును దోచుకెళ్లారన్నారు. గురువారం ఉదయం పూజల అనంతరం పూజారి గుడికి తాళం వేసి తన ఇంటికి వెళ్లాడు. గమనించిన దొంగలు ఆలయంలో చోరీకి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై సురేష్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల ఆచూకీ కష్టంగా ఉందని ఎస్సై పేర్కొన్నారు.

దాడి కేసులో నిందితులపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాముల గ్రామంలో వేంరెడ్డి జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. చిన్నకార్పాముల గ్రామంలో పాత గొడవల కారణంగా వేంరెడ్డి జగదీశ్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులపై ఆ గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో పాటు 15 మంది దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై వేంరెడ్డి జగదీశ్‌రెడ్డి భార్య జయలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి, ఏప్రిల్ 26 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా యాపలదిన్నె గ్రామానికి చెందిన నర్సప్ప ఇసుకను తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వాహన యజమాని నర్సప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు - తరలివచ్చిన భక్తజనం



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 26 : మండలంలోని చిన్నవడ్డెమాన్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం శివపార్వతుల (గిరిజా) కల్యాణోత్సవం జరిగింది. మండుటెండల్లోనూ శివుని కల్యాణానికి భక్తులు తరలివచ్చారు.

● స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సతీమని చల్లా ఆశ్లేషారెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రామలింగేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రాశస్త్యమైనదని, ఈ ఆలయాన్ని రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు వట్టెం రాజేశ్వరి, ఎంపీటీసీ స్వప్న, నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వట్టెం రాము, వట్టెం శివకుమార్, ఆలయ అర్చకులు వీరేషం, వేదపండితులు శివశక్తిస్వామిలతో ఆయా గ్రామాలనుంచి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాటికొండలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

భూత్పూర్, ఏప్రిల్ 26 : మండలంలోని తాటికొండ గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా ప్రారంభించారు. గ్రామ దేవతలైన పోచమ్మ, కోటమైసమ్మ, ఊరడమ్మ, బొడ్రాయి, శీతలమాత, బండారు మైసమ్మ మొదలైన విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిరంతరాయంగా జరుగనున్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తనవంతుగా విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగస్వాములు అయ్యారని గ్రామస్థులు తెలిపారు. మొదటి రోజు గణపతిపూజ, గోపూజ, ప్రదక్షిణ, రుత్విక్ వర్ణి, యాగశాల ప్రవేశం, అఖండదీపస్థాపన, కలశస్థాపన, యంత్రపూజ, వాస్తు, నవగ్రహ పూజలు, విగ్రహాల జలాధివాసం వంటి వాటితో పాటు అఖండ భజనలు వేదపండితుల సమక్షంలో వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భజన భక్తులు పాల్గొన్నారు.

త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



పెద్దమునుగాల్‌చెడ్‌లో మాట్లాడుతున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

అడ్డాకుల, ఏప్రిల్ 26 : అందరికీ అందుబాటులో ఉండి గ్రామాలలో సమస్యలు పరిష్కరిస్తానని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. శుక్రవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అడ్డాకుల మండలం చిన్నమునుగాల్ చెడ్, పెద్దమునుగాల్‌చెడ్ గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ జ్యోతితో పాటు 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, చిన్నమునుగాల్‌చెడ్ గ్రామంలో మాజీ సర్పంచు కనకయ్య, మాజీ ఉప సర్పంచు బంగ్లా నాగభూషణంతో పాటు 40 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, గట్లఖానాపూర్ ఎంపీటీసీ దామోదర్, వెంకటరాములు, వెంకటరెడ్డి, ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సి.లక్ష్మారెడ్డి

నవాబ్‌పేట, ఏప్రిల్ 26 : ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు చించోడ్ అభిమన్యురెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తకుంట తండాలో నూతనంగా నిర్మించిన అంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారిని తండావాసులు సన్మానించారు. అంతకు ముందు కేశవరావుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘు గుప్తా, చందర్ నాయక్, రమేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, శ్రీను, మాజీ సర్పంచ్ తరుణ్ పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే తండాల అభివృద్ధి



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, ఏప్రిల్ 26 : గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లంబాడికుంట తండాలో గిరిజనులు ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఆల హాజరయ్యారు ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు నారాయణగౌడ్, సత్యనారాయణ, ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు మురళీధర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదిరెడ్డి, గోప్లాపూర్ సత్యనారాయణ, మాన్యనాయక్, శంకర్‌నాయక్, మేఘనాథ్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

మిడ్జిల్, ఏప్రిల్ 26 : ప్రతీ ఓటరు ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ రాజయ్య తెలిపారు. శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని పాతబజార్ హనుమాన్ ఆలయం సమీపంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లా స్వీప్ కార్యక్రమంలో భాగంగా మెప్మా సిబ్బందికి సమావేశం స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్‌తో కలిసి కమిషనర్ రాజయ్య నిర్వహించారు. ఓటరు చైతన్యం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కళాజాత బృందంచే ఓటు హక్కు, ఓటు హక్కు వినియోగం గురించి కళాప్రదర్శన చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ నరేష్, మెప్మా జడ్చర్ల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సునీత, లక్ష్మి, మాసూంబాబా, సాధిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే సీపీఎం మద్దతు

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లి

పాలమూరు, ఏప్రిల్ 26 : ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని, అందుకే కాంగ్రెస్ పార్టీకే సీపీఎం మద్దతు ఇస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లి, జిల్లా కార్యదర్శి ఏ.రాములు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మతోన్మాద బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆర్.వెంకట్రాములు, జబ్బార్, జి.వెంకటస్వామిరెడ్డి, నల్లవెల్లి కురుమూర్తి, ప్రశాంత్ పాల్గొన్నారు.

సర్వే రిపోర్టులు మన వైపే

- స్థానిక నాయకులతో ముచ్చటించిన మాజీ సీఎం కేసీఆర్



బాలానగర్‌లో కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

మిడ్జిల్(జడ్చర్ల)/ బాలానగర్, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికైన కొన్ని రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సర్వేరిపోర్టులన్నీ మనకు పాజిటివ్‌గా ఉన్నాయని, మనమే గెలుస్తున్నామని, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డిని చూసి మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పోరుబాటలో భాగంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రోడ్ షో కార్యక్రమానికి వెళుతూ జడ్చర్ల మండలం గొల్లపల్లి, మాచారం గ్రామాల మధ్యన ఉన్న మినర్వా ఫుడ్‌కోర్టు వద్ద కాఫీ తాగేందుకని కాసేపు బస్సును నిలిపారు. హోటల్‌లోకి వెళ్లిన వెంటనే రాజాపూర్ మండలంలోని దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి, నాగిరెడ్డిలతో పాటు పలువురు నాయకులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి పరిచయం చేశారు. పార్లమెంట్ ఎన్నికలలో కష్టపడి పనిచేయాలని సూచించినట్లు అక్కడ ఉన్న నాయకులు తెలిపారు. 45నిమిషాల పాటు అగిన మాజీ సీఎం కేసీఆర్ అక్కడి నుంచి జడ్చర్ల మీదుగా మహ బూబ్‌నగర్ వెళ్లారు. 'సీఎం కేసీఆర్ అంటూ' కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు. అంతకుముందు బాలానగర్‌లో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సులోనుంచే ప్రజలకు అభివాదం చేశారు. కేసీఆర్‌పై గులాబీ పూల వర్షం కురిపించారు. కేసీఆర్ ప్రజల వద్దకు రావడంతో కార్యకర్తలు జయజయ ధ్వానులతో స్వాగతం పలికారు.

కాటవరంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



ఆలయంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

అడ్డాకుల, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని కాటవరంలో పునర్నిర్మించిన శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శివలింగం, అమ్మవారు, నవగ్రహ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, దేవరకద్ర మాజీ శాసనసభ్యుడు ఆల వెంకటేశ్వర్ రెడ్డిలు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, నిర్వాహకులు నాయకులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా అడ్డాకుల మండల పరిధిలోని కన్మనూరులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సతీమణి ఆశ్లేషారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం తిమ్మాయిపల్లి తండాలో ఓ వివాహ శుభకార్యంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, దశరథ్‌రెడ్డి, వేగనాథ్‌లు కాగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, మహేశ్‌యాదవ్, బొడ్డు రమేశ్, శెట్టినాయక్, నాయకులు పాల్గొన్నారు.

పదవులు అనుభవించి, పార్టీపై విమర్శలా ?

- డీకే అరుణ ముఖ్యమంత్రిని విమర్శించడం సరికాదు

- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



మాట్లాడుతున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఏప్రిల్ 26 : తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో అన్ని పదవులు అనుభవించి అవకాశవాదంతో పార్టీని వీడిన డీకే అరుణ కాంగ్రెస్ పార్టీపైనే విమర్శలకు దిగడం శోచనీయమని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ విమర్శించారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీలో అన్నీ హోదాలను డీకే అరుణ అనుభవించారని అన్నారు. అవకాశ వాదిగా మారి పార్టీ ముఖ్యమంత్రిని విమర్శించడం తగదన్నారు. రాజకీయాల్లో జూనియర్లు, సీనియర్లు ఉండరని, ఆ విషయాన్ని ఆమె గమనించాలని అన్నారు. అలంపూర్ వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తీసుకొస్తే కేంద్రం దాన్ని రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మతం పునాదులపై బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు కుయుక్తులు పన్నుతున్నదని, ఆ పార్టీకి కాలం చెల్లిందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎంకు కానుకగా ఇచ్చేందుకు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకతకు మారుపేరుగా మోదీ పాలన

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమాదేవి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమాదేవి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఏప్రిల్ 26 : కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలన పారదర్శకంగా సాగిందని బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమాదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రలోని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో భారతీయ జనతా పార్టీ 400 సీట్లకు పైగా పార్లమెంట్ స్థానాలను గెవబోతున్నదని, అందులో పాలమూరు పార్లమెంట్ స్థానం పక్కా అని అన్నారు. మహబూబ్ నగర్ ఎంపీసీ గెలిపించుకోలేకపోతే రేవంత్ సీఎం పదవి పోతుందని భవోద్వేగాలకు లోనై బీజేపీ అభ్యర్థి డీకే అరుణపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇది వారి కుసంస్కారానికి నిదర్శనం అన్నారు. డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ అసలైన సెక్యులర్ పార్టీ అని వివరించారు. మీది సెక్యులర్ పార్టీ అయితే రామమందిరం ప్రారంభోత్సవానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాలం కలిసొచ్చింది కాబట్టి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్, ఉపాధ్యక్షురాలు నిరంజనమ్మ, కార్యదర్శి పద్మవేణి, జయశ్రీ, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి కె. రాములు, కౌన్సిలర్ రామాంజనేయులు, కోస్గి సతీష్‌కుమార్, ఎం. తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

యువసమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మిడ్జిల్ : ఈనెల 28వ తేదీ జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో నిర్వహించనున్న బీజేవైఎం యువసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేవైఎం జాతీయ కోశాధికారి టీమ్ సాయి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవేళ్ల మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జడ్చర్ల టౌన్ అధ్యక్షుడు పిట్టల నరేష్, రూరల్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌ముదిరాజ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ ఉన్నారు.

స్నేహితుడి కూతురి వివాహానికి ఆర్థిక సహాయం

మిడ్జిల్, ఏప్రిల్ 26 : తమ స్నేహితుడు వారితో లేకపోయినప్పటికీ వారి కుటుంబానికి అండగా నిలిచిన తోటి స్నేహితులను పలువురు అభినందిస్తున్నారు. జడ్చర్ల మండలంలోని లింగంపేట పాఠశాలకు చెందిన 1993-94వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన నారాయణ కుమార్తె వివాహం ఉందని తెలుసుకున్న తోటి స్నేహితులు శేఖర్‌గౌడ్, ఆనంద్, నాగేష్, చెన్నయ్య, తిరుపతి, శేఖర్, మంజుల, షాహీన్‌బేగం, లక్ష్మయ్య శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు స్నేహితులు కలిసి తులం బంగారాన్ని అందజేశారు. తన స్నేహితుడు మృతి చెందినప్పటికీ గుర్తుంచుకొని కూతురి వివాహ సమయంలో బంగారం అందజేయడం పట్ల గ్రామస్థులు, వివాహానికి వచ్చిన బంధువులు వారిని అభినందించారు.

వివాహిత అదృశ్యం

మిడ్జిల్, ఏప్రిల్ 26 : పొరుగు రాష్ట్రానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్ఐ అశోక్‌బాబు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గ జిల్లా, జైవరిగిరి తాలూకా, మాడిగి గ్రామానికి చెందిన జెట్టి రాంచరణ్, ఈ నెల 24వ తేదీన జడ్చర్ల పట్టణంలోని బంధువుల ఇంట్లో వివాహం ఉన్నందున కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. 25వ తేదీన సాయంత్ర ఆరు గంటల సమయంలో తన కూతురైన జాగీర్‌దార్ రేణుక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని తండ్రి జెట్టి రాంచరణ్ తమకు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. చుట్టు పక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 26వ తేదీన తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు. మూడేళ్లుగా రేణుకకు మతిస్థిమితం సక్రమంగా లేదని ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.


పబ్లిక్ బోర్లను పూడ్చితే చర్యలు : ఎంపీడీవో

గండీడ్, ఏప్రిల్ 26 : గ్రామాల్లో పబ్లిక్ బోర్లను పూడ్చితే చర్యలు తప్పవని ఎంపీడీవో దేవన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ పంచంగాల తండాలలో పర్యటించి ఉపాధి హామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. ఈ నెల 18వ తేదీన పగిడ్యాల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి ముందున్న పబ్లిక్ బోరులో రాళ్లు వేసి మూయడంతో గ్రామస్థులు ఎంపీడీవోకు, గ్రామ కార్యదర్శులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం పగిడ్యాల్ గ్రామానికి వెళ్లి బోరును తిరిగి రీ ప్రెస్ చేయించి సింగిల్ ఫేజ్ మోటార్‌ను బిగించారు. ఎవరైనా పబ్లిక్ బోర్లను మూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో హరిచంద్రుడు, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించుకుందాం

పాలమూరు, ఏప్రిల్ 26 : 138వ మేడేను విజయవం తంగా నిర్వహించుకుందామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి యం.రామ్మోహన్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రం, బొక్కలోనిపల్లి, బండమీదిపల్లి, ధర్మాపురం, అడవి వెంకటాపురంలో మేడే సన్నాహక సమావేశం నిర్వ హించారు. కార్యక్రమంలో టి.నరసింహ, లక్ష్మయ్య కేశవులు, కృష్ణయ్య, అబ్దుల్లా, శివ, ఏ.నరసింహ, రాజు,రవి, చెన్నయ్య దాసు, సంతోషం, వాసు, మురుగేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు చిన్నారుల ఎంపిక



కోడ్గల్ సెక్టార్‌లో చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసిన అంగన్‌వాడీ టీచర్లు

మిడ్జిల్, ఏప్రిల్ 26 : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం ప్రాథమిక విద్య ఎంపిక సర్టిఫికెట్లను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యనభ్యసించి ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేసినట్లు అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వరూప తెలిపారు. కార్యక్రమంలో ఆయాలు లావణ్య ఉన్నారు.

జడ్చర్లలో....


జడ్చర్ల మండలంలోని కోడ్గల్ సెక్టార్ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని లక్ష్మీనాయక్ గైరాన్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణమ్మ, సరస్వతి, మేఘమాల, జయమ్మ, భాగ్య, నాయకులు రతన్, మోహన్ ఉన్నారు.

తరలుతున్న కలప

- విలువైన వృక్ష సంపద మాయం

- చెట్లను నరికివేస్తున్న వ్యాపారులు

- కొరవడిన అటవీ అధికారుల పర్యవేక్షణ



లింగంపల్లి గ్రామ శివారులో ఓ పొలం వద్ద తుమ్మ మొద్దులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 26 : మండలంలో అటవీ సంపద కనుమరుగవుతోంది. ఈ అడవిని కాపాడాల్సిన అధికారుల సల్లని చూపు కలప వ్యాపారులపై ఉండటంతో వారి వ్యాపారం మూడు ట్రాక్టర్లు, ఆరు లారీలు అన్నట్లుగా సాగుతోంది. రాత్రి ఏడు గంటలు అయిందంటే జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌కు కలప లారీలు, ట్రాక్టర్ల ద్వారా నిత్యం విలువైన కలప తరలిపోతుంది. దీంతో విలువైన కలప కళ్లముందే హారతి కర్పూరంలా కరిగిపోతోంది. ఇలా వ్యాపారులను అడవిలో కలపను నరుకుతుంటే, మరో వైపు హరితహారం కింద మండలంలో చాలా గ్రామాల్లో మొక్కలను విద్యుత్ వైర్లకింద నాటడంతో అవి నేడు విద్యుత్ వైర్లకు తాకేలా పెరిగాయి. విద్యుత్ ప్రసారానికి అడ్డంకిగా మారడంతో సిబ్బంది అలాంటి చెట్లను నరికేస్తున్నారు.

మరో నల్లమల

కొత్త పాలమూరు జిల్లాకు మరో నల్లమలగా పిలువబడె మైసమ్మ అడవితో పాటు నిత్యం వివిధ గ్రామాల నుంచి చెట్లను నరికి రాత్రికి రాత్రి కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్, నవాబ్‌పేట, జడ్చర్ల, చౌడాపూర్, మహ్మదాబాద్, కుల్కచెర్ల తదితర మండలాల సహద్దులు ఉన్న ఈ అడవి సుమారు ఎనిమిది వేల హెక్టార్లలో విస్తరించింది. ఇక్కడ టేకు, మద్ది, నల్లమద్ది, వేప, బిట్లి, చెనంగి, ఇతర ఔషధ గుణాలు కల్గిన వనాలు ఉన్నాయి. అలాగే వన్యమృగాలతో పాటు మూగజీవాలకు సైతం అనువైన ప్రాంతం. కానీ, కాలక్రమేనా అధికారుల పుణ్యమా అంటూ కనుమరుగు కానుంది.

నిత్యం కలప లారీల మోత

పెరిగిన చెట్లను మండలంలోని కొల్లూర్, పోమాల, కారుకొండ, లోకిరేవు, రుద్రారం, ఇప్పటూర్, లింగంపల్లి తదితర గ్రామాల నుంచి హైదరాబాద్‌కు చెందిన కొంతమంది కలప వ్యాపారులు రైతుల పొలం గట్లపై ఉన్న చెట్లను నయానో బయానోకు కొనుగోలు చేసి వాటిని నరికి లారీల ద్వారా హైదరాబాద్, షాద్‌నగర్‌కు తరలిస్తున్నారు. చెట్లను నరుకుతున్నట్లు రైతులు ఎవరైనా సమాచారం ఇస్తే గంటల వ్యవధిలో అధికారులు క్షేత్ర స్థాయికి చేరుకొని వ్యాపారులను బెదిరించి ఎంతో కొంత నగదు వసూలు చేసుకొని జారుకుంటున్నారు. అక్కడ ఏమీ జరగడం లేదని పై అధికారులకు సమాచారం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

చర్యలు తప్పవు : బీట్ ఆఫీసర్

మండలంలోని వివిధ గ్రామాలలో కలప తరలిపోతుండడంపై అటవీ బీట్ అధికారి రమేష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కలప రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎక్కడైనా తరలిస్తున్నట్లు తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని అయన తెలిపారు. రాత్రివేళల్లో కలప తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.

రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది కేటాయింపు

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 26 : మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికలలో భాగంగా రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించిన పోలింగ్ (బృందాలను) సిబ్బందిని ఏర్పాటు చేసి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాలకు కేటాయించారు. కలెక్టరేట్‌లోని ఎన్.ఐ.సి సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ నేతృత్వంలో సాధారణ పరిశీలకులు షేవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో ఎన్.ఐ.సి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని 867 పోలింగ్ కేంద్రాలకు గాను 120 శాతం 1040 మంది పోలింగ్ (బృందాలు), సిబ్బందిని ఎంపికచేసి నియోజకవర్గాలకు కేటాయించారు. ఒక్కో పోలింగ్ (కేంద్రం) బృందంలో (సిబ్బంది) పీ.ఓ, ఒక ఏ.పీ.ఓ, ఇద్దరు ఓ.పీ.ఓలు ఉంటారు. నివాస, పనిచేస్తున్న, స్వంత నియోజకవర్గ నిబంధనలు పాటిస్తూ మహిళలకు మినహాయింపు ఇస్తూ పారదర్శకంగా ర్యాండమైజేషన్ నిర్వహించారు. నారాయణపేట జిల్లా పోలింగ్ కేంద్రాలకు కూడా నియోజకవర్గంలో పోలింగ్ బ్రుందాలు ఏర్పాటు చేసి ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ సమావేశంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డి.ఐ.ఓ సత్యనారాయణమూర్తి, డైరెక్టర్ ఐ.టీ.బి. సంపత్, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి ప్రవీణ్, ఏఓ శంకర్, తదితరులు ఉన్నారు.

ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

బాలానగర్, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం మండలంలోని హేమాజీపూర్‌లో మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంబీ బాలకృష్ణ

మిడ్జిల్, ఏప్రిల్ 26 : బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జడ్చర్ల పట్టణానికి చెందిన బాలకృష్ణ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి నియమాక పత్రాన్ని బాలకృష్ణకు అందజేసినట్లు బీజేపీ నాయకులు శుక్రవారం తెలిపారు. తనను బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించేందుకు కృషి చేసిన బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ, పార్లమెంటు ఇంచార్జి జోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

- ఫైర్ మన్ శివకుమార్

- జనరల్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఏప్రిల్ 26 : ప్రస్తుతం ఎండా కాలంలో ఎండ తీవ్రత వలన అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, అందు వలన వాటిపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఫైర్‌మన్ శివకుమార్ అన్నారు. అగ్ని ప్రమాదాలపై శుక్ర వారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఫైర్‌స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎండాకాలంలో వేడి ఎక్కువగా ఉండడం వలన అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ముందస్తుగా వాటిని గుర్తిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. సిలిండర్ వాడకం, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలు సంభవిం చినప్పుడు 101కు ఫోన్ చేయాలని సూ చించారు. సిలిండర్‌లో మంటలు వచ్చినపుడు వాటిని ఎలా ఆర్పాలనే విషయంపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎంవోలు డాక్టర్ శిరీష, డాక్టర్ ఈసిస్, డాక్టర్ శ్వేత, నర్సింగ్ సూపరింటెండెంట్ కృపమ్మ, సీహెచ్‌వో రామునాయక్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో పాటు 100 మంది ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.